మొక్కవోని దీక్ష

- తొమ్మిదో విడతలో 63.70 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక
- నర్సరీల్లో 70 లక్షల మొక్కల పెంపు
- పర్యవేక్షిస్తున్న డీఆర్‌డీఏ, అటవీ శాఖ, పురపాలికలు



నగర శివారు మేడ్చల్ జిల్లాలో గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో పెరుగుతున్న నర్సరీలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా 63.70 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు 2023–24 సంవత్సరంలో జిల్లా పరిధిలోని 40 ప్రభుత్వ శాఖలతో కలిసి అటవీ శాఖ ప్రణాళికలు రూపొందించింది. పండ్లు, పూల మొక్కలతో పాటు టేకు వంటి 38 రకాల మొక్కలు ప్రతి గ్రామ, పట్టణ పొలిమేర పరిధితో కలుపుకుని నాటేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. పురపాలికలు, పంచాయతీ పరిధిలోని ప్రతి కుటుంబ సభ్యులతోపాటు స్మృతివనాలు , డంపింగ్ యార్డులు, పార్కులు, లేఅవుట్లు, గ్రామ కంఠం , చెరువుగట్లు, ప్రభుత్వ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పరిశ్రమలు, రైతు పొలాల్లో ఉపాధి హామీ కింద బండ్, బ్లాక్ ప్లాంటేషన్‌పై మొక్కలు నాటేందుకు కూడా కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేశారు. ఎక్సైజ్ విద్యాశాఖ, పంచాయతీ రాజ్ పురపాలక శాఖలు పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు పలు చోట్ల ప్రదేశాలను గుర్తిస్తున్నారు. మిగతా ప్రభుత్వ శాఖలతో పాటు గ్రామ పంచాయతీలు, పురపాలికలు కూడా మొక్కలు నాటేందుకు గుంతలు తీసే పనిపై నిమగ్నమైనట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

ఈసారి స్థానిక మొక్కలకు ప్రాధాన్యం.

ఈ ఏడాది పూలు, పండ్ల మొక్కలతోపాటు దోమల నివారణకు సంబంధించిన మొక్కలను నివాసాలకు పంపిణీ చేయనున్నారు. ఇంటి ముందు నాటుకునేందుకు అటవీశాఖ నర్సరీల నుంచి మొక్కలను తెప్పిస్తామని అధికారులు చెబుతున్నారు.. ఖాళీ స్థలాలను పట్టణ ప్రకృతి వనం మాదిరి తీర్చిదిద్దాలనుకునే వారికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తామంటున్నారు. స్థానికంగా ఉండే మొక్కలు (చింత, జామ, మునగ తదితరాలు)కు



అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

వివిధ శాఖలకు నర్సరీల బాధ్యత

నర్సరీల నిర్వహణ బాధ్యతలను ఇప్పటికే పలు శాఖలకు అప్పగించారు. నీళ్ల పడుతూ మొక్కలు ఎండిపోకుండా సంరక్షణ చర్యలను ప్రత్యేక సిబ్బంది చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడి వేడి తగలకుండా షేడ్నెట్ (ఆకుపచ్చ పరదాలను అందుబాటులో ఉంచారు. వీటితో పాటు నర్సరీల్లో ఏర్పాటు చేసిన బోర్లు పాడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరమ్మతులకు గురైతే. బాగుచేసి అందుబాటులోకి తెస్తామని చెబుతున్నారు. ఇప్పటికే ఎవెన్యూ, మీడియన్ ప్లాంటేషన్ పేరిట మొక్కలను అందుబాటులోకి తెచ్చారు.

హరితహారం కోసం నర్సరీలు

హరితహారంలో భాగంగా నగర శివారు జిల్లాలలో 2023–24 సంవత్సరంలో 63,70 లక్షల మొక్కలు నాటటమే లక్ష్యంగా 61 గ్రామ పంచాయతీలు ,13 పురపాలక సంఘాల్లో మొత్తంగా 74ప్రాంతాల్లో నర్సరీలను అధికార యంత్రాంగం పెంచుతోంది. ఈ నర్సరీల్లో దాదాపు 70 లక్షల మొక్కలు ఉత్పత్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 61 గ్రామ పంచాయతీల్లో గ్రామీణ అభివృద్ధి సంస్థ నర్సరీలను పర్యవేక్షిస్తుండగా, మిగతా ప్రాంతాల్లోని నర్సరీలను అటవీ శాఖ,పురపాలక సంఘాలు పర్యవేక్షిస్తున్నాయి.

గతంలో నాటిన మొక్కల సంరక్షణపై లోపాలివే..

హరితహారం భాగంగా గతంలోనగర శివారుల్లో నాటిన మొక్కల్లో దాదాపు 30 శాతం మొక్కలు ఎండిపోయిన విషయాన్ని గుర్తించిన అధికారయంత్రాంగం మొక్కల సంరక్షణపై తగిన విధంగా చర్యలకు సిద్ధమవుతోంది. మొక్కలకు ఫెన్సింగ్ లేకపోవటంతోపాటు ఎదుగుదలకు నీటి వసతి సరిగ్గా లేకపోవటంతో నాటిన మొక్కలు ఎండిపోయాయి. మొక్కలు ఉచితంగా పంపిణీ చేసినప్పటికిని, గుంతలు తీసేందుకు డబ్బులు చెల్లించారు. పెద్ద మొక్కలు నాటేందుకు 3 గుంతలు తీస్తే రూ.180, చిన్న మొక్కలు నాటేందుకు 13 గుంతలు తీస్తే రూ.180 చెల్లిస్తున్నారు. మొక్కలను విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వెంచర్లు, రోడ్లకు ఇరువైపుల నాటారు. వీటిని నాటేందుకు ఈజీఎస్ నిధులను కూడా ఉపయోగించగా, పలు సంస్థలు కూడా కొన్ని నిధులు వెచ్చించించాయి. మొక్కలు నాటటం ఉద్యమంలా చేపట్టినప్పటికిని, సంరక్షించటంలో మాత్రం కొన్ని సంస్థలు విఫలమైనట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా...

ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ



మేడ్చల్: మండలంలోని పురాతన ఆలయాలలో ఒకటైన అత్వెల్లి వెంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులను త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ప్రారంభించారు. గ్రామ పెద్దలు కేశవరెడ్డి, ఈశ్వరయ్య, సంజీవ, మల్లేష్‌గౌడ్, కొండల్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్,దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు పంటపొలాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి మూడవ వార్డు ఇళ్ళ నుండి వెలువడుతున్న మురికి నీరు పొలాల్లోకి వెళ్ళకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు మున్సిపల్ మేనేజర్ శ్రీదేవికి వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌ను కలిసి సమస్యను వివరించి పంటలు నాశనం కాకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

జాబ్‌మేళా



ఘట్‌కేసర్: ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(కేపీఆర్ఐటీ)లో గురువారం ఓమ్నీ క్లౌడ్, లెగట్టో సంస్థల ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. జాబ్‌మేళాలో పలువురు విద్యార్థులు రూ. 4–8 లక్షల వేతన ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల చైర్మన్ ప్రతాపరెడ్డి పాల్గన్నారు.

లీగల్ సర్వీస్ సెంటర్ ప్రారంభం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో 13వ వార్డులో ఏర్పాటు చేసిన లీగల్ సర్వీస్ సెంటర్‌ను గురువారం స్థానిక కౌన్సిలర్ దొడ్ల మల్లిఖార్జున్ ముదిరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, బాల్‌రాజ్, నాయకులు ఆంజనేయులు, ప్రవీణ్,రమేష్,లక్ష్మీనారాయణ,వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి చెత్త సేకరణపై అవగాహన




మేడ్చల్: గ్రామాలలో సిబ్బంది తడి పొడి చెత్తలను వెర్వేరుగా సేకరించి వేర్వేరుగా డంపింగ్ యార్డులకు తరలించాలని ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజమల్లారెడ్డి అన్నారు .మండలంలోని డబీల్‌పూర్, నూతన్‌కల్ గ్రామాలలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. సర్పంచ్‌లు గీత భాగ్యరెడ్డి కవిత జీవన్, ఉపసర్పంచ్‌లు సత్యనారయణ,ప్రభాకర్‌రెడ్డి నాయకులు

గోధుమకుంటలో స్వచ్ఛ సర్వేక్షణ్

కీసర: గోధుమకుంట గ్రామంలో గురువారం గ్రామసర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామస్తులకు తడి–పొడిచెత్తను వేరుచేసే విధానాన్ని వివరించారు. ఎంపీఓ నందకిషోర్, ఉపసర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణోత్సవం



ఉప్పల్: ఉప్పల్ బీరప్పగడ్డలోని తేనె నర్సింహా స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తుల కోలాహలం మధ్య గురువారం వైభవంగా జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

వ్యవసాయాభివృద్ధికి పెద్ద పీట



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: తెలంగాణలో వ్యవసాయం అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. గురువారం ప్రతాపసింగారంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ. 2060లు, కామన్ గ్రేడ్ రకం ధాన్యానికి రూ. 2,040ల మద్దతు ధర ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రైతు బంధు మండల కోఆర్డినేటర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



కీసర: దాతల సహకారంతో యాద్గార్‌పల్లి గ్రామంలో కొత్త పంచాయతీ భవనాన్ని నిర్మించనున్నట్లు గ్రామసర్పంచ్ పుట్టరాజు తెలిపారు. ఈ మేరకు శిథిలావస్థకు చేరిన పాత పంచాయతీభవనాన్ని కూల్చివేసి కొత్తపంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించి భూమి పూజ కార్యక్రమంలో ఆయన గ్రామస్తులతోకలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీసభ్యుడు జూపల్లివెంకటేష్, ఉపసర్పంచ్ మల్లేష్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

లభించని బాలుడి ఆచూకీ..



మంగలికుంటను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ, ఎస్సై అశోక్

ఘట్‌కేసర్: దుస్తులు ఉతకడానికి తల్లి, అత్తతో కలిసి మున్సిపాలిటీలోని కొండాపూర్ మంగలోని కుంటలో బుధవారం గల్లంతైన సంతోశ్ (12) కోసం రెండో రోజు కూడా గాలింపు కొనసాగింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు, నగరం నుంచి ఫైర్ సిబ్బంది, రాచకొండ విపత్తు నిర్వహణ బృందం, జీహెచ్ఎం సిబ్బంది కుంటలో గాలించారు. చీకటి పడడంతో రెండో రోజు గాలింపు నిలిపేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, సీఐ అశోక్‌రెడ్డి పరిశీలించారు.

వరదనీటి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోండి



జోనల్ కమీషనర్ మమతకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్

అల్వాల్: ముంపు నివారణ చర్యలలో భాగంగా వరదనీటి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ మమతను కోరారు. గురువారం జోనల్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. రాబోయే వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే అవకాశం ఉందని గతంలో ప్రతిపాదించిన పనులను సత్వరమే పూర్తి చేయాలని కోరారు. స్పందించిన జోనల్ కమీషనర్ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు చిన్నారెడ్డి, రాజు, మహేష్, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: జాతీయ రహదారిపై ఇటీవల కురిసిన వర్షాల వల్ల గుంతలు పడిన రోడ్లు, రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్న ప్రాంతాలను గురువారం మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు, ప్రాజెక్టు మేనేజర్ స్వామి, సైట్ ఇన్‌చార్జ్‌లు విజయ్, మనోజ్ పరిశీలించారు.

- బోయినపల్లి చెక్‌పోస్ట్ నుంచి కొంపల్లి ఫ్లైఓవర్ వరకు ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ట్రాఫిక్, నేషనల్ హైవే అథారిటీ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 10 కిలోమీటర్ల మేర వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు ముందుకొచ్చారు.
- ముఖ్యంగా కొంపల్లి ఫ్లైఓవర్ వద్ద ఎగువ భాగం నుంచి వచ్చే వర్షపునీరు మొత్తం ప్రధాన రహదారి



గోతులను పరిశీలిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, హైవే ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు

చంద్రారెడ్డి గార్డెన్, అపర్ణకాలనీ వద్ద తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతోందని గుర్తించామని తెలిపారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

జయగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని జేఎల్ఎన్ఎస్‌నగర్‌లో జయగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం స్వామివారి జయంతి ఉత్సవాలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుండి స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అంకురారోపణ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనములు భక్తి శ్రద్ధలతో జరిగాయి. శుక్రవారం స్వామివారి మూలమంత్ర హవనము, 11 గంటలకు స్వామివారి కల్యాణం, మహానివేదనము, హారతి, మంత్రపుష్పము, బలిహరణ, తీర్థ ప్రసాద వితరణ భక్తులకు ఆశీర్వచనము, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం స్వామివారి పల్లకి సేవ ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ అరుణ్‌సింగ్, అర్చకులు రఘుకిరణాచార్యులు పాల్గొన్నారు.

కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

కీసర: ప్రభుత్వం ప్రజల కంటి సమస్యలను పరిష్కరించేందుకు వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 14 వ వార్డు శ్రీరాంనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అన్ని వార్డుల్లో ఈ కంటివెలుగు వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహిస్తారన్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన మేయర్



జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో రూ.4.79 కోట్లతో నిర్మిస్తున్న ప్రధాన రహదారి పనులను జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ కావ్య, హెచ్ఆర్‌డీసీఎల్ డీఈఈ కిశోర్‌బాబుతో కలిసి గురువారం పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణలు పాటించి త్వరిత గతిన పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను మేయర్ ఆదేశించారు.

పీహెచ్‌డీ ఫీజులు తగ్గించాలని నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజు పెంపుపై నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం క్యాంపస్‌లోని న్యాయ కళాశాల ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తూ నిరసన తెలిపారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు పీహెచ్‌డీ అడ్మిషన్లు రద్దు చేసుకుంటున్నారని పెంచిన ఫీజును ఉపసంహరించుకోవాలని వీసీ ప్రొ.రవీందర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లి సత్య, ఆజాద్, అఖిల్, స్వరాజ్, మధు, మహేష్, వెంకట్, గోవర్ధన్, రవి పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

మల్లాపూర్: దేశంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలుండాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్ అన్నారు. సమానమైన అవకాశాలుండాలనే ఉద్దేశంతో రాజ్యాంగం రూపొందించారన్నారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా గురువారం నాచారం డివిజన్‌లోని హెచ్ఎంటీనగర్, రాఘవేంద్రనగర్, రాంరెడ్డినగర్, బాపూజీనగర్ కాలనీల్లో ఇంటింటికి సీపీఐ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీఎస్ బోస్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తూట్లుపొడిచిందన్నారు. సీపీఐ, ఏఐవైఎఫ్ నేతలు దామోదర్‌రెడ్డి, ధర్మేంద్ర, శంకర్‌రావు, సత్యప్రసాద్, నర్సింహా, కృపాకర్, సాయిలు, శివ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంటీ.. డంపింగ్ కేంద్రమా ఏంటి?



జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

చింతల్: వందలాది ఎకరాల విస్తరించి ఉన్న హెచ్ఎంటీ పరిశ్రమ ఖాళీ స్థలం అక్రమ డంపింగ్‌లకు అడ్డగా తయారైంది. పరిశ్రమ ఖాళీ స్థలం చుట్టూ అనేక బస్తీలు వెలవగా గతంలో హెచ్ఎంటీ అధికారులు కొన్ని ప్రాంతాల్లో అక్రమణలను తొలగించి మరికొన్ని ప్రాంతాల్లో గోడలను నిర్మించారు. మరి కొన్ని ప్రాంతాల్లో కందకాలు గోడలు ఏర్పాటు చేయని ఖాళీస్థలాలు అక్రమ డంపింగ్‌లకు కేంద్రాలుగా మారాయి.

- డివిజన్‌లోని చింతల్ బస్టాప్ నుంచి భగత్‌సింగ్‌నగర్‌కు వచ్చే దారిలో కొంతమేర హెచ్ఎంటీ అధికారులు కందకం తీయకుండా గోడల నిర్మించకుండా అలాగే వదిలేశారు. దీని పక్కనే శ్మశానవాటిక ఉండటంతో ఇటువైపు కొంత మేర ఖాళీ ప్రదేశంగా ఉంటుంది. కొంతమంది అక్రమార్కులు కూల్చివేసిన ఇళ్ల వ్యర్థాలను తీసుకువచ్చి ఇక్కడ పారబోస్తున్నారు.
- ఇక్కడ వ్యర్థాలను పారబోద్దంటూ జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా అవేవీ తమకు పట్టనట్లుగా పలువురు అక్రమణదారులు ఇళ్ల వ్యర్థాలను ట్రాక్టర్లలో తీసుకువచ్చి డంప్ చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.
- ఇక్కడి నుంచి హెచ్ఎంటీ కాలనీలోని ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న బాటల్లో కొంతమంది గంజాయి అలవాటు పడ్డ యువకులు అడ్డాగా మార్చుకున్నారు. ఇక్కడ జనసంచారం లేక పోవడం కారణంగా రోడ్డు నుంచి బస్టాప్ వెళ్లే వారికి.. అటు నుంచి ఇటు వచ్చే వారికి ఈ గంజాయికి అలవాటు పడ్డ యువకులు పెద్ద ఆటంకిగా మారారు.
- లక్ష్మీనగర్ నుంచి హెచ్ఎంటీ బస్టాండ్ కు వెళ్లే వారిని రాత్రి వేళల్లో వెనుక నుంచి తరుముతూ భయభ్రాంతులకు గురి చేస్తూ వారి వద్ద ఉన్న నగలు, సొమ్మును తస్కరించి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.



హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశంలో డంప్ చేస్తున్న ఇళ్ల వ్యర్థాలు

- జీహెచ్ఎంసీ అధికారులు చొరవ తీసుకొని భగత్‌సింగ్‌నగర్‌లోని చింతల్ శ్మశానవాటిక నుంచి హెచ్ఎంటీకాలనీ వరకు ఉన్న ఖాళీ ప్రదేశంలో గోడలను నిర్మించినట్లయితే ఆకతాయిలకు అడ్డుకట్ట పడటంతో పాటు అక్రమంగా డంపింగ్ చేసే వారు సైతం ఎక్కడ డంపు చేయకుండా ఉంటారని స్థానికులు పేర్కొంటున్నారు.

అగ్నిప్రమాదంలో పరుపుల షాపు దగ్ధం

మల్లాపూర్: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఓ పరుపుల షాపు దగ్ధమైన ఘటన మల్లాపూర్‌లో చోటు చేసుకుంది. మల్లాపూర్ ప్రధాన రహదారిలో గల ఎస్‌కే తస్లీమ్ పరుపుల షాపులో రోజువారిగా పనులు చేసుకుంటుండా నిప్పురవ్వలు వచ్చాయి. చూస్తుండగానే మంటలు అంటుకుని భారీ ఎత్తున వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పరుపుల షాపు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

జీహెచ్ఎంఎంయూ అధ్యక్షుడిగా నర్సింహగౌడ్

మల్లాపూర్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఎల్బీనగర్ జోన్ అధ్యక్షుడిగా సిద్దగోని నర్సింహగౌడ్ ఎన్నికయ్యారు. అదేవిధంగా టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంబాబును నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నర్సింహగౌడ్, రాంబాబును నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ గురువారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు మహేష్, నర్సింగ్‌రావు, విజయ్, ఎన్. బాబు, అనిల్, శివ, బలరాం తదితరులు పాల్గొన్నారు.